
సాక్షి ఒడిశా

సోమవారం । 30 । అక్టోబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 4,08,263

– భువనేశ్వర్/పూరీ

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

రాష్ట్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలుచోట్ల పూజలు, సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

- 8లో





పండగలతో సంస్కృతి పరిరక్షణ

సంస్కృతి పరిరక్షణకు పండగల నిర్వహణతో సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

వణికిస్తున్న చలిపులి

- జంట నగరాల్లో తగ్గిన ఉష్ణోగ్రత

భువనేశ్వర్: రాష్ట్రంలో చలితీవ్రత పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో ఆదివారం కనిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెల్లవారుజాము, రాత్రిపూట గణనీయంగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. జి.ఉదయగిరి, ఫుల్బాణిలో అత్యల్పంగా 13 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. సీజన్‌లో తొలిసారిగా శనివారం భువనేశ్వర్‌లో రాత్రి పూట కనిష్ఠంగా 20 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. కటక్ నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 20.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

దట్టంగా పొగమంచు..

రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. కలహండి, కొరాపుట్, భద్రక్ జిల్లాల్లో పొగమంచు తీవ్రత అధికంగా ఉంది. ఇతర జిల్లాల్లో పొడి వాతావరణం నెలకొంది. అంతర్గత, ఉత్తర ఒడిశాలోని అనేక ప్రదేశాలలో ఉష్ణోగ్రత 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ తగ్గిందని స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. రానున్న కొద్ది రోజుల్లో వాతావరణ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు వచ్చే అవకాశం లేదని పేర్కొంది. నవంబర్ 1 నుంచి కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడిన మద్యంతో బరంపురం ఎక్సైజ్ అధికారులు

బరంపురం: చత్రపూర్–బరంపురం రహదారిలో అబకారీ అధికారులు జరిపిన సోదాల్లో విదేశీ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఈ ఘటనలో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఆదివారం చమ్మఖండి పోలీసుస్టేషన్ పరిధిలోని బొనుగునాపల్లిలో ఓ కారులో అక్రమంగా విదేశీ మద్యం బాటిళ్లు తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపారు. ఈ ఘటనలో 800 లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లు, వెయ్యి సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేసి డ్రైవర్ సీహెచ్ మాణిక్‌కుమార్‌ని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ జవాను ఆత్మహత్య

భువనేశ్వర్: నువాపాడా జిల్లాలో ఆదివారం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) జవాన్ సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తమిళనాడుకు చెందిన డి.గుణశేఖరగా గుర్తించారు. ఈయన ఖొడుపాణి గ్రామంలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపస్‌లో 19వ బెటాలియన్ సబ్–ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. విషయం తెలిసిన వెంటనే నువాపడా జిల్లా బోడెన్ ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

జేకేపూర్‌లో చోరీ



నీలాంబర్ ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

రాయగడ: సదరు సమితి సమీపంలోని జేకేపూర్ పారిశ్రామికవాడలో చోరీ జరిగింది. కాళిదాస్‌నగర్‌లో నివాసముంటున్న పాత్రికేయుడు నీలాంబర్ మిశ్రో ఇంట్లో దుండగులు చొరబడి వస్తువులను చిందరవందరగా పడేశారు. విలువైన చీరలు దొంగిలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13న నీలాంబర్ మిశ్రో కుటుంబంతో కలిసి భువనేశ్వర్ వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు శనివారం రాత్రి ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం బాధితుడి ఇంటి ఎదురుగా నివసిస్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించి వెంటనే సమాచారం అందించారు. బంధువులు వచ్చి చూడగా చీరలు, రూ.3వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. బంగారం వంటి విలువైన వస్తువులు తమ వెంట తీసుకు వెళ్లడంతో చోరీకి గురికాలేదని నీలాంబర్ తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

రైలు పట్టాలపై రక్తపు మరక



ధ్వంసమైన బోగీల వద్ద సహాయక చర్యలు

రాత్రి పూట కొన్ని బతుకులు తెల్లారిపోయాయి. రైలు పట్టాలపై దారి కాచిన మృత్యువు బారిన పడి కొందరి ప్రయాణాలు శాశ్వతంగా ఆగిపోయాయి. అంతవరకు కబుర్లు, కాలక్షేపాలతో సందడిగా కనిపించిన రైలు బోగీలు ఆర్తనాదాలతో నిండిపోయాయి. రైలును భారంగా మోస్తున్న పట్టాలకు రక్తపు మరకలు అంటుకున్నాయి. విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంతో జిల్లా ఉలిక్కిపడింది. ఈ ప్రమాద బాధితుల్లో జిల్లా వాసులూ ఉన్నారు.

- విజయనగరం జిల్లాలో పలాస పాసింజర్‌ను ఢీకొట్టిన రాయగడ పాసింజర్
- మృతులు, క్షతగాత్రుల్లో సిక్కోలు వాసులు
- రాత్రంతా కొనసాగిన సహాయక చర్యలు



ప్రమాద ఘటన ఊహా చిత్రం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం, జి.సిగడాం: విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి–చినరావుపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా వాసులు చిక్కుకున్నారు. ఓవర్‌హెడ్ కేబుల్ తెగిపోవడంతో నిలిచిపోయిన విశాఖ–పలాస రైలును వెనక నుంచి వస్తున్న విశాఖ–రాయగడ పాసింజర్ ఢీకొట్టడంతో భారీ ప్రమాదం సంభవించింది. ఇందులో పలాస పాసింజర్ రైలుకు చెందిన వెనక మూడు బోగీలు ప్రమాదానికి గురయ్యాయి. ఈ బోగీల్లో శ్రీకాకుళం జిల్లా వాసులు ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారు. కడపటి సమాచారం మేరకు జి.సిగడాం మండలం ఎస్‌పీఆర్‌పురం గ్రామానికి చెందిన గిడిజాల లక్ష్మి(43) మృతి చెందారు.

ఈ ప్రమాదంతో శ్రీకాకుళం జిల్లా మరోసారి ఉలిక్కిపడింది. ఆ మధ్య ఒడిశాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రమాదానికి గురైనప్పుడు మన జిల్లాకు చెందిన ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డ విషయం తెలిసిందే. వాస్తవానికి ఆ ప్రమాదానికి గురైన రైలు మన జిల్లాలో హాల్ట్ లేకపోవడంతో భారీ ప్రాణ నష్టం తప్పింది. అయితే తాజాగా ప్రమాదానికి గురైన విశాఖ–పలాస పాసింజర్‌కు జిల్లాలో హాల్ట్‌లు ఎక్కువ. దీంతో బాధితుల్లో జిల్లా వాసులే అధికంగా ఉండొచ్చని భావిస్తున్నారు. పాసింజర్ రైలు కావడంతో క్షతగాత్రుల వివరాలు తెలుసుకోవడం కష్టంగా మారుతోంది.



ప్రమాదంలో మృతి చెందిన గిడిజాల లక్ష్మి

శుభ కార్యానికి వెళ్లి..

జి.సిగడాం మండలం ఎస్‌పీఆర్‌పురానికి చెందిన గిడిజాల లక్ష్మి (43) ఓ శుభకార్యం నిమిత్తం వైజాగ్ వెళ్లారు. ఈమెతో పాటు 15 మంది వెళ్లారు. ఫంక్షన్ అయిపోయిన తర్వాత తిరిగి వచ్చేందుకు విశాఖ–పలాస రైలును ఎక్కారు. వీరిలో 14మంది ఇంజిన్ వెనకున్న మూడో బోగీలో ఎక్కగా, గిడిజాల లక్ష్మీ మాత్రం చివరి బోగీలో ఎక్కారు. రాయగడ పాసింజర్ రైలు ఢీకొట్టడంతో ఆఖరు బోగీలో చిక్కుకుపోయిన ఆమె మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాగే జి.సిగడాం మండలం మెట్టవలస గ్రామానికి చెందిన డెంకాడ అప్పన్నమ్మ ఇదే ప్రమాదంలో గాయాలపాలైంది. జి.సిగడాం గ్రామానికి చెందిన కీర్తి రాములమ్మకు రెండు కాళ్లు విరిగిపోయాయి. అమృత, రమణ, సూర్యకాంతం, మోక్షలకు తీవ్ర గాయాలయ్యాయి. టంకాల సుజనమ్మ ఒక్క కాలు విరిగిపోయింది. వీరు కొత్తవలస ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

భారీ శబ్దం.. గాల్లో బోగీలు..



ప్రత్యక్ష సాక్షి కథనం

నేను సింహాచలం స్టేషన్‌లో పలాస పాసింజర్ ట్రైన్ ఎక్కాను. ఆరుగంటలకు రావాల్సిన ట్రైన్ 6.15కి వచ్చింది. నార్త్ సింహాచలం, పెందుర్తి, కొత్తవలస, కంటకాపల్లి స్టేషన్‌లు దాటాం. అక్కడకు 10 నిమిషాల వ్యవధిలో ఒక్కసారిగా పెద్ద శబ్దం. నేను చివరి నుంచి నాలుగో బోగీలో ఉన్నా. మా బోగీ ఒరిగి పక్క ట్రాక్ మీద ఉన్న గూడ్స్ ట్రైన్‌కు ఆనుకుని ఉండిపోయింది. మా తర్వాత 3 బోగీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ బోగీల్లో చాలా వరకు చిన్నారులు, మహిళలు, భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. బోగీల్లో చిక్కుకున్న 15 మంది మహిళలు, చిన్నారుల్ని సురక్షితంగా బయటకు తీసుకొచ్చి సపర్యలు చేశా. పెద్ద ప్రమాదమే. నేను వ్యాపార పనుల కోసం వారంలో మూడు రోజులు ఇదే ట్రైన్‌కు వెళ్లి వస్తుంటా. – కిరణ్ కుమార్ పాత్రో, మాజీ సైనికుడు, పలాస

పలాసలో హెల్ప్‌డెస్క్



కాశీబుగ్గ: విశాఖపట్నం–పలాస పాసింజర్ ప్రమాదంతో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ అధికారులు స్పందించి పలాస రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ప్రయాణికుల కుటుంబాలు, బంధువులు 06742492245 06742490555 06742534027 9090522120, 8917387241, 9040277587, 8895670954 నంబర్లను సంప్రదించాలని పలాస రైల్వేస్టేషన్ మేనేజర్ తెలిపారు.

ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో..

ఆమదాలవలస: రైలు ప్రమాద ఘటనకు సంబంధించి శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస)లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. సహాయ సంప్రదింపుల కోసం 0891–2885911, 0891–2885912, 0891–2885913, 0891–2885914, 08942286245, 08942286213 నంబర్లకు కాల్ చేసుకోవచ్చని సూచించారు.



జి.సిగడాం: తీవ్ర గాయపడిన మెట్టవలస వాసి డెంకాన అప్పన్నమ్మ

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

రాయగడ: విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదం నేపథ్యంలో సహాయక చర్యలు చేపడుతున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా 30వ తేదీ సోమవారం పలు రైళ్లను రద్దు చేస్తున్నామని, మరో ఆరు రైళ్లను దారి మళ్లిస్తున్నామని డీఆర్‌ఎం కార్యాలయం ఖుర్దా నుంచి ప్రకటన విడుదలైంది. రద్దయిన రైళ్లలో రాయ్‌పూర్–విశాఖపట్నం (08527), విశాఖపట్నం–రాయ్‌పూర్ (08528), భువనేశ్వర్–ముంబై (11020)(స్వల్పమార్పు), ముంబై–భువనేశ్వర్ (11019)(స్వల్పమార్పు), 20809, 17479, 07468 నంబర్ గలవి ఉన్నాయి. అలాగే దారి మళ్లించిన రైళ్లు బరౌని–కోయంబత్తూరు (03357), టాటా–ఎర్నాకులం (18189), భువనేశ్వర్–ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), హౌరా –సికింద్రాబాద్ (12703), హౌరా బెంగుళూర్ (12245).



ప్రమాద వివరాలను తెలుసుకుంటున్న రాయగడ రైల్వే మేనేజర్ పిడిసిక, సిబ్బంది

రాయగడ నుంచి సహాయక బృందాల తరలింపు



ఘటనా స్థలానికి బయలుదేరిన స్పెషల్ రిలీఫ్ ట్రైన్

రాయగడ: విజయనగరం జిల్లా కంటకాపల్లి–అలమండ స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి చోటుచేసుకున్న రైలు ప్రమాదానికి సంబంధించి రాయగడ నుంచి సహాయక బృందాలను తరలించామని స్టేషన్ చీఫ్ మేనేజర్ పరమానంద పిడిసిక తెలిపారు. రాయగడ రైల్వే స్టేషన్ పరిధిలోని వైద్య బృందాలతో పాటు ఇంజినీరింగ్ తదితర శాఖలకు చెందిన సిబ్బంది స్పెషల్ రిలీఫ్ ట్రైన్‌లో ఘటనా స్థలానికి వెళ్లారని చెప్పారు. కంటకాపల్లి అలమండ రైల్వే స్టేషన్ల మధ్య విశాఖ నుంచి రాయగడ వస్తున్న ప్యాసింజరు ట్రైన్‌ను పలాస–విశాఖపట్నం ప్యాసింజర్ ఢీ కొనడంతో ప్రమాదం సంభవించినట్లు ప్రాథమిక సమాచారం అందిన వెంటనే చర్యలు చేపట్టినట్లు వివరించారు. పూర్తి సమాచారం రావాల్సి ఉందని తెలిపారు. విశాఖపట్నం డీఆర్‌ఎం సౌరభ్ త్రిపాఠి ఘటనా స్థలంకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు సమాచారం.

ఆ దృశ్యాలు.. అదృశ్యం కావేమో..!

- **13** — 2013: విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గొట్లాం వద్ద రైలు నుంచి పొగలు వస్తున్నాయని చైను లాగి ప్రయాణికులు పట్టాలు దాటి పరిగెడుతుండగా పక్క ట్రాక్‌పై వస్తున్న మరో రైలు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో 13 మంది చనిపోయారు.
- **40** — 2017 జనవరి: పార్వతీపురంలోని కూనేరు వద్ద రైలు పట్టాలు తప్పడంతో 40 మంది ప్రయాణికులు మృతి చెందారు.
- **5** — 2022: జి.సిగడాం మండలం బాతువ వద్ద కోయంబత్తూరు రైలు నుంచి పొగలు వస్తుండటంతో ప్రయాణికులు రైలు చైను లాగి పక్క ట్రాక్‌పైకి పరుగెత్తారు. అదే సమయంలో అటు నుంచి వస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ఐదుగురు ప్రయాణికులు చనిపోయారు.
- **275** — 2023 జూన్: ఒడిశాలో జరిగిన కోరమండల్ రైలు ప్రమాదంలో 275 మందికి పైగా ప్రయాణికులు మృతిచెందారు.

24 గంటలు.. 4 హత్యలు



హత్యకు గురైన ధునియా సాహు



మంగోళో బుమ్యా మృతదేహం

- గంజాం జిల్లాలో పాతకక్షలతో దాడులు
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలో హత్యలు కలకలం సృష్టించాయి. 24 గంటల వ్యవధిలో వేర్వేరు ఘటనల్లో నలుగురు హత్యకు గురికావడం స్థానికంగా సంచలనం రేపింది. పాతకక్షల నేపథ్యంలో ఈ దాడులన్నీ జరిగినట్లు ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపారు. ఆదివారం ఉదయం బరంపురం నగరానికి సమీపంలో సదర్ పోలీసుస్టేషన్ పరిధిలో కుకుడాఖండి బ్లాక్ లంజియాగడా గ్రామంలో మంగోళో బుమ్యా అనే వ్యక్తిని ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడి చేసి హతమార్చారు. అనంతరం నిందితులు పరారయ్యారు. మరో ఘటనలో సెరగడా గ్రామంలో ఓ ఇంట్లో చొరబడి తల్లీకుమారుడిని మారణాయుధాలతో హతమార్చి పరారయ్యారు. బెగునియాపడా పోలీసు స్టేషన్ పరిధిలోని కన్యరబడి గ్రామ శివారున దీపు పాత్రో అనే వ్యక్తి హత్యకు గురయ్యారు. పోలీసులు మృతదేహాన్ని గుర్తించి హత్య కేసు నమోదు చేశారు. ఈ నాలుగు హత్యలకు సంబంధించిన నిందితులను పోలీసులు గాలిస్తున్నారు.



దీపు పాత్రో మృతదేహం

రాష్ట్ర 26వ గవర్నర్‌గా రఘుబర్‌దాస్

- 31న ప్రమాణ స్వీకార ముహూర్తం



భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి రఘుబర్‌దాస్ రాష్ట్ర 26వ గవర్నర్‌గా ఈ నెల 31న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్థానిక రాజ్‌భవన్‌లో ఉదయం 11.45 గంటలకు ప్రమాణ స్వీకారం జరగనుంది. రఘుబరదాస్‌ను ఒడిశా కొత్త గవర్నర్‌గా ఈ నెల 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించిన సంగతి తెలిసిందే. మాజీ గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ పదవీ కాలం పూర్తి కావడంతో ఈ నియామకం జరిగింది. గణేషీలాల్ రాష్ట్రానికి వీడ్కోలు పలికి శుక్రవారం తన సొంత రాష్ట్రం హర్యానాకు వెళ్లారు.

సోమవారం పూరీకి..

గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న రఘుబరదాస్ సోమవారం ఉదయం రైలులో పూరీకి చేరుకుంటారు. అనంతరం పూరీలోని జగన్నాథ ఆలయం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. మంగళవారం ప్రమాణ స్వీకారం చేసే ముందు స్థానిక లింగరాజ్ ఆలయం సందర్శించనున్నట్లు తెలిసింది.

విద్యార్థి కార్యకర్తగా..

రఘుబర దాస్ 2014 నుంచి 2019 వరకు జార్ఖండ్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఆ రాష్ట్రానికి తొలి గిరిజనేతర ముఖ్యమంత్రిగా నిలిచారు. జంషెడ్పూర్ కో–ఆపరేటివ్ కాలేజీలో ఉత్తీర్ణత సాధించి న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. 1976–77లో లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించిన విద్యార్థి ఉద్యమంలో కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు శిక్ష అనుభవించారు. 1977లో జనతా పార్టీ లో చేరి, మూడేళ్ల తర్వాత బీజేపీలో చేరారు. 2004లో బీజేపీ జార్ఖండ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

అలరించిన సాహితీ సదస్సు

రాయగడ: స్థానిక స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రామలింగేశ్వర మందిరంలో ఆదివారం నిర్వహించిన సాహితీ సదస్సు ఆహూతులను అలరించింది. సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కవులు, రచయితలు పెద్ద సంఖ్యలో కవితలు, రచనలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా స్పందన సాహితీ విభాగం కార్యదర్శి సింగిడి రామారావు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు కవితలు, రచనలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. రోజురోజుకు కనుమరుగవుతున్న సాహిత్యం విలువలను భావితరాలకు తెలియజేసేలా కృషి చేయాలన్నారు. మనోభావాలను వ్యక్తం చేసే సాహిత్యాన్ని గౌరవించాలన్నారు. స్పందన వంటి సంస్థ సాహిత్యాన్ని, కళాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తూ 28 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ తులసీదాస్, డాక్టర్ బాబూరావు మహంతి, పి.రామ్మోహన్‌రావు, టి.గౌరి, పి.అప్పారావు, పి.ఎం.జి.శంకరరావు, సాహితీ విభాగం కార్యదర్శి కె.కె.ఎం.పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సాహితీ విభాగం కార్యదర్శి రామారావు

ఉల్లి అక్రమార్కులపై చర్యలు

భువనేశ్వర్: రాష్ట్రమంతటా ఉల్లిపాయల ధరలు అకస్మాత్తుగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఉల్లి అక్రమ నిల్వలు, నల్ల బజారు వ్యవహారాలకు పాల్పడే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తామని ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి అతున్ సబ్యసాచి నాయక్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో కిలో ఉల్లి ధర రూ. 60 నుంచి రూ. 70కి పెరిగింది. దాదాపు నెల రోజుల తర్వాత తాజా ఉల్లిపాయలు మార్కెట్‌లోకి వస్తాయని పేర్కొన్న మంత్రి ప్రస్తుతం ఉత్పత్తి, సరఫరాలో అంతరం ఏర్పడిందన్నారు. వినియోగదారులకు సరసమైన ధరకు ఉల్లిని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఉల్లి ధరలు పెరిగాయని తెలిపారు. ఈ పరిస్థితుల్ని సొమ్ము చేసుకునే దిశలో కొందరు అసాంఘిక వ్యాపారులు పెద్ద మొత్తంలో కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ వర్గాలపై గా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించామని మంత్రి తెలిపారు.

క్లుప్తంగా

మృతదేహం ఎవరిదో!



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జయపురం: కొరాపుట్ జిల్లా కుందులి పంచాయతీ పారజపుంగార్ గ్రామం సమీపంలోని సాకిడి జంక్షన్‌లో మృతదేహం కలకలం సృష్టించింది. గుర్తు తెలియని వాహనం నుంచి మృతదేహాన్ని విసిరేశారని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న పొట్టంగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. నవరంగపూర్ నుంచి క్లూస్‌టీం వచ్చి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కొరాపుట్ సహిద్ లక్ష్మణ్ నాయిక్ ఆస్పత్రికి తరలించారు.

పొట్టకూటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



భర్త ఫొటోతో సోని పారజ, బంధువులు

జయపురం: కూలి పనిచేసేందుకు ఆగస్టు 5న హైదరాబాద్ వెళ్లిన వ్యక్తి జాడ తెలియక అతడి భార్యాపిల్లలు కుంగిపోతున్నారు. జయపురం సమితి కుములిపుట్ గ్రామ పంచాయతీ గొండగుడ గ్రామానికి చెందిన ధన పూజారి, ధనుర్జయ కుంభార్, మల్కనగిరి జిల్లా మత్తిలి గ్రామ సమీపంలోని గురుగుడ గ్రామానికి చెందిన ధనుర్జయ పూజారి ఆగస్టులో హైదరాబాద్‌కు వలస వెళ్లారు. కొద్దిరోజుల తర్వాత ధనుర్జయ కుంభార్, ధనుర్జయ పూజారి తిరిగి వచ్చేశారు. ధన పూజారి మాత్రం తిరిగి రాలేదు. భర్త జాడ తెలియకపోవడంతో బొరిగుమ్మ పోలీసుస్టేషన్ భార్య సోని పారజ ఫిర్యాదు చేసింది. ఆర్థిక ఇబ్బందులతో తన ఆరేళ్ల కుమారుడు, 15, 18 ఏళ్ల కుమార్తెలకు భోజనం కూడా పెట్టలేని పరిస్థితి ఉందని వాపోయింది.

చెరువులో పడి వ్యక్తి మృతి

రణస్థలం: మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం సమీపంలో గల చెరువులో పడి పెదగాపు రాంబాబు(38) అనే వ్యక్తి మృతి చెందారు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నంలో పని చేస్తున్న రాంబాబు స్వగ్రామం విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని వల్లూరు వెళ్లేందుకు రణస్థలంలో ఈ నెల 26వ తేదీన దిగారు. అక్కడి నుంచి మద్యం మత్తులో 3 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి నడుకుదిటిపాలెం చెరువులో ప్రమాదవశాత్తు పడిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. నాలుగు రోజుల తర్వాత ఆదివారం మధ్యాహ్నం మృతదేహం నీటిపై తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వల్లూరు నుంచి కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత కేసు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెప్పారు. ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జిలో యువకుడు ఆత్మహత్య



కాశీబుగ్గ స్వప్నలాడ్జిలో ఆత్మహత్య చేసుకున్న ఢిల్లీ యువకుడు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కాశీబుగ్గ కేటీ రోడ్డులో ఉన్న స్వప్నలాడ్జిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. మృతుడిని ఢిల్లీకి చెందిన రాజ్‌పుత్ నరేష్ అలియాస్ నగేష్(25)గా గుర్తించారు. అతను శనివారం స్వప్న లాడ్జిలో దిగాడు. ఆదివారం ఉదయం ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి లాడ్జి సిబ్బంది చూసే సరికి ఉరి వేసుకున్నట్లు కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. కాశీబుగ్గ ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రాముడు విశేషజ్ఞుడు

శ్రీకాకుళం కల్చరల్: రాముడు విశేషజ్ఞుడు అని, స్వధర్మ రక్షకుడని విజయనగరానికి చెందిన విశ్రాంత తెలుగు పండితుడు రాళ్లపల్లి రామసుబ్బారావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో వాల్మీకి జయంతి ఉత్సవాల సందర్భంగా సీతమ్మ–హనుమ ధర్మసంవాదంపై ఆదివారం ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరగా రాముని దర్శనం చేసుకునే భాగ్యం కలిగించాలని సీతమ్మ హనుమను కోరిందన్నారు. ముందుగా వక్త రామసుబ్బారావును మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎస్ఎన్ స్వామి, సనపల నారాయణమూర్తి, కోమలరావు, ఎం.ప్రసాదరావు, పెద్ది ఈశ్వరరావు, సరస్వతి, అరుణకుమారి ఉన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత




బరంపురం : ప్రత్యేక అలంకరణలో మాకాళువ అమ్మవారు




బరంపురం: అమ్మవారి ఘటంతో తిరువీధి నిర్వహిస్తున్న మహిళలు



బరంపురం: గుసానినువాగంలో మహాలక్ష్మి పూజలు



బరంపురం: చంద్రమణి పేటలో మహాలక్ష్మి పూజలు



జయపురం: బంకమఠంలో గజలక్ష్మి పూజ



జయపురం: సైరవీధిలో లక్ష్మీనరశింహ, గజలక్ష్మి పూజలు



పర్లాకిమిడి: మంగళి వీధి జంక్షన్‌వద్ద గజలక్ష్మి పూజలు

బరంపురం: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. మా కాళువా సంబరాలు, మహాలక్ష్మి పూజలు, గజలక్ష్మి పూజలతో సందడి వాతావరణం నెలకొంది. బరంపురంలోని గుసానినువాగంలో 15 రోజులుగా జరుగుతున్న మా కాళువా సంబరాలు శనివారం అర్ధరాత్రితో ముగిశాయి. గౌరీపౌర్ణమి సందర్భంగా గుసానినువాగం ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రధాన ఘటాన్ని తిరువీధుల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మహాలక్ష్మి పూజలు ప్రారంభం

బరంపురం: నగర పరిధిలోని పలు కూడళ్లలో మహాలక్ష్మి పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గుసానినువాగం జంక్షన్‌లో పూజా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రమిపేటలోనూ పూజలు జరిగాయి. వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు.

జయపురంలో గజలక్ష్మి పూజలు

జయపురం: రాజనగర్ కూడలి వద్ద గజలక్ష్మి పూజలు ప్రారంభమయ్యాయి. జయపురం మెయిన్ రోడ్డు బంకమఠంలో 25 ఏళ్ల సంప్రదాయాన్ని ఈ ఏడాదీ కొనసాగించారు. జయపురం మహంతి సాహి సౌరవీధిలో లక్ష్మీనరశింహ అవతారంతో గజలక్ష్మి పూజలు నిర్వహించారు.

పర్లాకిమిడి: స్థానిక ఒడ్డి మంగళవీధి జంక్షన్‌లో గజలక్ష్మి పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒడిశా వాసులకు ఆదివారం నుంచి కార్తీక మాసం ప్రారంభమైనందున గజలక్ష్మి దేవిని దర్శించుకుని దీపారాధన చేస్తున్నారు.



పర్లాకిమిడి: ఒడ్డిమంగళ వీధిలో గజలక్ష్మి పూజలు

ఉత్సాహంగా మార్షల్ ఆర్ట్స్ పోటీలు



మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులతో ఎమ్మెల్యే కె.నారాయణరావు

పర్లాకిమిడి: స్థానిక గుండిచా మందిరం వద్ద ఆనందభవన్‌లో గజపతి జిల్లా తైక్వాండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ 20వ వార్షికోత్సవం సందర్భంగా మార్షల్ ఆర్ట్స్‌లో పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అకాడమీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి యుద్ధ కళ నైపుణ్య ప్రదర్శన పోటీల విజేతలకు బ్లాక్, రెడ్, యెల్లో, బ్లూ బెల్ట్‌లను ప్రదానం చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తైక్వాండో మార్షల్ అకాడమీ కార్యదర్శి కార్తీక్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన

జగన్నాథ్‌సాగర్‌లో పూడికల తొలగింపు



కలుపు మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

జయపురం : స్థానిక జగన్నాథ్ సాగర్‌లో ఆదివారం పూడికల తొలగింపు పనులు చేపట్టారు. మున్సిపల్ సిబ్బంది అధునాతన యంత్రం సాయంతో సాగర్‌లో గుర్రపు డెక్క, చెత్తాచెదారాలు తొలగించారు. మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్ పనులు పర్యవేక్షించారు.

భారీగా గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: కలిమెల సమితి బెజాంగ్‌వాడ వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 496 కిలోల గంజాయిన పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను అరెస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన షేక్ అఫ్సర్ మహమ్మద్ కలిమెల సమితి బెజాంగ్‌వాడలో గంజాయిని కొనుగోలు చేసిన ట్రక్‌లో పండ్ల బుట్టల కింద దాచి బయలుదేరాడు. వాహనం అతివేగంగా రావడం గమనించిన పోలీసులు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. నిందితున్ని అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.35 లక్షలు ఉంటుందని తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

చీకటిలోనే బతుకు తెల్లారిపోయింది

- ఎడ్ల బండిని ఢీకొట్టి యువకుడు మృతి
- నిబంధనలు పాటించని ఇసుక బండ్లు



ఘటనా స్థలంలో మృతదేహం



మృతుడు పంచముఖేశ్వరరావు (ఫైల్)



చీకటిలో ఇసుక తీసుకెళ్తున్న ఎడ్ల బండి

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఆదివారంపేట సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికే చెందిన గుసిరి పంచముఖేశ్వరరావు అలియాస్ శివ (32) దుర్మరణం పాలయ్యారు. స్కూటీపై వెళ్తున్న శివ ఇసుక ఎడ్ల బండిని ఢీకొట్టి అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశాడు. దీనిపై శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు..

నగరంలోని బలగ సమీపంలోని హడ్కో కాలనీకి చెందిన శివ రిమ్స్‌లో అసిస్టెంట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతని తండ్రి రిమ్స్‌లోనే పని చేస్తూ మృతి చెందారు. అనంతరం శివ కూడా ఇక్కడే పనికి కుదిరాడు. భార్య శ్రీకళతో కలిసి నగరంలోనే నివాసం ఉండేవాడు. ఆమె కూడా అదే ఆస్పత్రిలో డెంటల్ విభాగంలో డీహెచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి ఆస్పత్రి నుంచి పిలుపు రావడంతో శివ ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. రాత్రి పదిన్నర వరకు ఆస్పత్రిలోనే ఉన్నాడు. ఆస్పత్రిలో పని ముగియడంతో హైవేలో ఉన్న దాబా వద్ద భోజనం చేసి అటు నుంచి ఇంటికి వెళ్తానని సహచరులతో చెప్పి బయల్దేరాడు. ఆదివారం పేట చైతన్య స్కూల్ దాటి వెళ్తుండగా చీకటిలో రోడ్డుపై వెళ్తున్న ఇసుక ఎడ్ల బండి కనిపించకపోవడంతో అమాంతం దాన్ని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడం, నోరు, చెవుల నుంచి రక్తం కారడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని రిమ్స్‌కు తీసుకెళ్లారు. రాత్రనగా వెళ్లిన భర్త ఇంకా ఇంటికి రాకపోవడంతో శివ భార్య శ్రీకళ కంగారు పడ్డారు. భర్తకు ఫోన్ చేస్తుంటే లిఫ్ట్ చేయకపోతుండడంతో ఏం జరిగిందో తెలీక భయపడ్డారు. కాసేపటికే ఆ ఫోన్‌ను లిఫ్ట్ చేసిన అంబులెన్స్ డ్రైవర్ శివ మృతి వార్త చెప్పడంతో ఆమె దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే తన ఆడపడుచు ఇందిర, అతని భర్త మహేష్‌లతో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. భర్త మృతదేహాన్ని చూసి ఆమె గుండెలవిసేలా రోదించారు. వీరికి ఇంకా సంతానం లేదు.

ఎడ్ల బండ్లతో ఇబ్బంది..

నగరంలో రాత్రిపూట ఎడ్లబళ్లపై కొందరు ఇసుక తరలిస్తున్నారు. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న గ్రామీణ, పట్టణ సర్కిల్ పరిధిల్లోని చాలా ప్రాంతాల్లో నిత్యం వందలకు పైగా ఎడ్ల బళ్లను ఇసుకకు, చెరకు గడల లోడింగ్‌కు రాత్రి సమయాన వాడుతుంటారు. వీరు ఇసుక తీసుకెళ్లవచ్చునని ప్రభుత్వం కూడా అనుమతి ఇచ్చింది. అయితే రాత్రిపూట చీకటిలో ఈ ఎడ్ల బండ్లు కనిపించక చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ బళ్లకు రేడియం స్టిక్కర్లు, లైటింగ్ వంటివి ఉంటే ప్రమాదాలు జరగవని నిపుణులు సూచిస్తున్నారు. నగరంలోని హయాతినగరం, కిల్లిపాలెం, కొత్తపేట, పొన్నాడ, ఆమదాలవలస ఆర్చి రోడ్డు (తోటాడ పాయింటు), సతివాడ, కల్లేపల్లి, బైరి జంక్షన్ (నైర, గూడెం పాయింటు), పెద్దపాడు–రామలక్ష్మణ–డేఅండ్‌నైట్ మీదుగానే కాక పెద్దపాడు నుంచి హైవే మీదుగా కొత్తరోడ్డు నుంచి ఆమదాలవలస తోటాడకు, అదే కొత్తరోడ్డు నుంచి బలగ మీదుగా టౌన్‌లోకి ప్రతిరోజూ ఒక్కో ప్రాంతానికి 50 కు పైగా బళ్లు వెళ్తుంటాయని పోలీసులు చెబుతున్నారు. ఈ బండ్లు తోలేవారు కాస్త అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

ఇసుక బళ్లు రాత్రి సమయాల్లో కొన్ని నిబంధనలు తప్పక పాటించాలి. ముఖ్యంగా రేడియం స్టిక్కర్లు బళ్లకు అంటించి, చార్జింగ్ లైట్లు వెంట తీసుకెళ్లాలి. ఆదివారంపేట జరిగిన ప్రమాదంలో ఎడ్లబండి వాడు రహదారి మార్జిన్‌లోకి రావడం, బండికి రేడియం స్టిక్లర్లు లేకపోవడం, చిమ్మచీకటి కావడంతో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టి మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

– విజయ్‌కుమార్, ఎస్ఐ, శ్రీకాకుళం రూరల్

పండగలతో సంస్కృతి పరిరక్షణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి



ఆకట్టుకున్న జానపద నృత్యం



చిన్నారుల ప్రదర్శన



అలరించిన సంబల్‌పురి డ్యాన్స్

జయపురం: ప్రాచీనమైన ఉత్కళ సంస్కృతిని సంప్రదాయాన్ని పరిరక్షించేందుకు పండగలు దోహదపడతాయని జయపురం ఎమ్మెల్యే తారాప్రాద్ బాహిణీపతి అన్నారు. శనివారం రాత్రి జయపురం రాజనగర్ కూడలి వద్ద జయపురం కుమార ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుమార పూర్ణిమ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండగల నిర్వహణ ద్వారా భావితరాలకు సంస్కృతిని పరిచయం చేయవచ్చన్నారు. అనంతరం కుమార పూర్ణిమ ప్రాముఖ్యతను వివరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడుఏ సురేష్‌దాస్, జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జయపురం అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ దేవేంద్రకుమార్ బాహిణీపతి, జిల్లా కాంగ్రెస్ కమిటీ కోశాధికారి నిహార్ బిశాయిలు మాట్లాడుతూ సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యతని పేర్కొన్నారు. అనంతర నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

చిన్ని ప్రాణాలకు ఆపద

- బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కవల పిల్లలు
- చికిత్స చేయించలేకపోతున్న తల్లిదండ్రులు
- దాతలు కరుణించాలని తల్లిదండ్రుల వేడుకోలు

ఇచ్ఛాపురం రూరల్: పదమూడు నెలల వయసు. చూడగానే ముద్దొచ్చే రూపం. వారి అల్లరిని చూస్తేనే కడుపు నిండిపోతుంది. ఇప్పుడిప్పుడే మాటలు నేర్చుకుంటున్నారు. ఈ ముద్దుగారే కవల పిల్లలు ప్రాణాల కోసం పోరాడుతున్నారు. ప్రాణాంతకమైన బోన్‌మేరో వ్యాధి సోకి చికిత్స కోసం ఎదురు చూస్తున్నారు. కూలి పనులు చేస్తే గానీ కడుపు నిండని స్థితిలో బిడ్డలకు చికిత్స చేయించలేక తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. దాతలు సాయం చేస్తే తమ బిడ్డల ప్రాణాలు దక్కుతాయని వేడుకుంటున్నారు. ఇచ్ఛాపురం మండలం కేశుపురం గ్రామానికి చెందిన శివంగి కూర్మారావు, భూలక్ష్మికి రెండున్నరేళ్ల కిందట వివాహమైంది. పదమూడు నెలలు కిందట అమ్మాయి, అబ్బాయి కవలలుగా పుట్టారు. వీరికి హర్షిత, హర్షవర్ధన్ అని పేరు పెట్టుకున్నారు. ఉన్నంతలో పిల్లలను ముద్దుగా పెంచుకుంటున్నారు. అయితే ఆరు నెలల నుంచి ఇద్దరు చిన్నారుల ఆరోగ్య స్థితి అంతగా బాగుండడం లేదు. మేనరిక వివాహం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చినట్లు వైద్యులు చెప్పారు. ఇటీవల హర్షవర్ధన్ నోరు, మల ద్వారం నుంచి రక్తాస్రావం కావడంతో విశాఖపట్నం ఆంధ్రా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు పరీక్షించి హర్షవర్ధన్ 'బోన్ మేరో' వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉండగా, పాప హర్షితకు కూడా వ్యాధి సోకవచ్చనే ఉద్దేశంతో వైద్యులు పరీక్షలు నిర్వహించడంతో తల్లిదండ్రులకు పిడుగులాంటి వార్త వినాల్సి వచ్చింది. ఇప్పుడిప్పుడే పాప హర్షితకు కూడా వ్యాధి సోకుతోందని, వెంటనే చెన్నైలో చికిత్స చేయాలని, అందుకు సుమారు ముప్పై లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరు చిన్నారులకు వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. తండ్రి కూర్మారావు మంగళూరులో ప్లాంట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇప్పటికే సుమారు ఐదు లక్షల వరకు ఖర్చయిందని, దాతలు స్పందిస్తే గానీ తాము చికిత్స చేయలేని స్థితిలో ఉన్నామని వారు చెబుతున్నారు. మనసున్న వారు స్పందించి తమ బిడ్డలకు ప్రాణభిక్ష పెట్టాలని అమ్మానాన్న కోరుతున్నారు. సాయం చేయాలనుకునే వారు 8074101661 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.



బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కవల పిల్లలు హర్షిత, హర్షవర్ధన్

క్లుప్తంగా

కారు ఢీకొని ఆటో డ్రైవర్‌కు గాయాలు



గాయాలపాలైన ఆటో డ్రైవర్ అప్పారావు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి ఆటో స్టాండ్ సమీపంలో కారు ఢీ కొని దత్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పి.అప్పారావు గాయాలపాలయ్యాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం నుంచి గజపతినగరం వస్తున్న కారు పెదమానాపురం సంత నుంచి కోమటిపల్లి ఆటోస్టాండ్‌కు వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి, తీవ్ర గాయాలపాలైన ఆటో డ్రైవర్‌ను 108లో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైజాగ్ కేజీహెచ్‌కు తరలించినట్లు పెదమానాపురం ఏఎస్సై కాశీరావు తెలిపారు.

అలరించిన ఆనందోబ్రహ్మ



అయిగిరి నందిని పాటకు నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు

విజయనగరం టౌన్: విజయనగర ఉత్సవాలు, శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక భాష్యం స్కూల్ పక్కన ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహుతులను కట్టిపడేశాయి. కమెడియన్ జబర్దస్త్ అప్పారావు, సీరియల్ నటులు కార్యక్రమాలను వీక్షించారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం నృత్యప్రదర్శన ఆకట్టుకున్నాయి. అయిగిరినందిని భక్తిగీతానికి చిన్నారులు చేసిన నృత్యప్రదర్శనకు ఆహూతుల కరతాళ ధ్వనులు మిన్నంటాయి. ఆనందోబ్రహ్మ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పీఎస్.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈవెంట్ సీఈఓ సరగడ తులసి, రామారావు, కృష్ణారెడ్డి, సంధ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతిచెందిన కొయ్యాన రాము(ఫైల్)

రాజాం సిటీ: మండల పరిధి ఎం.జోగివలస గ్రామానికి చెందిన కొయ్యాన రాము (24) శనివారం రాత్రి అగ్నిప్రమాదానికి గురై విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. శనివారం రాత్రి చీకటిపేట జంక్షన్ వద్ద తోటపల్లి కాలువ గట్టుపై బైక్ అదుపుతప్పి పడిపోయింది. అప్పటికే బైక్‌లో బాటిల్‌తో ఉన్న పెట్రోల్ ఆయనపై పడిన వెంటనే మంటలు అంటుకుని వళ్లంతా కాలిపోయింది. వెంటనే పక్కనే ఉన్న కాలువలో దూకి ఒడ్డుకు చేరలేక పోయాడు. ఉదయం కాలువవైపు స్నానానికి వచ్చిన స్వాములు బాధితుడిని గమనించి 108కు సమాచారం అందించారు. వారు వచ్చి రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోలీసులకు బాధితుడు జరిగిన విషయాన్ని వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

విపత్తులపై విజయం



భువనేశ్వర్: విపత్తు నిర్వహణ ప్రదర్శనలో మంత్రి సుదాం మరాండి

- రూ.2000 కోట్లతో నిర్వహణ వ్యయ ప్రణాళిక
- విపత్తు సంసిద్ధత దినోత్సవంలో సీఎం నవీన్
- ప్రతి ఇంటా విపత్తు నిర్వహణ యోధులు: చీఫ్ సెక్రటరీ



భువనేశ్వర్: విపత్తు సంసిద్ధత దినం పురస్కరించుకుని వీడియో సందేశం జారీ చేసిన ముఖ్యమంత్రి

భువనేశ్వర్: ప్రకృతి వైపరీత్యాలు రాష్ట్రం ముందున్న పెను సవాల్ అని, వాటిని విజయవంతంగా ఎదుర్కొందామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం విపత్తు సంసిద్ధత దినం పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా హాజరై ప్రసంగించారు. 1999 అక్టోబర్ 29న రాష్ట్రాన్ని తాకిన విధ్వంసకర సూపర్ సైక్లోన్‌కు గుర్తుగా ఒడిశా రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ(ఓస్డమా) ఏటా విపత్తు సంసిద్ధత దినం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల్లో విపత్తులను తట్టుకునేలా మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రూ.2,000 కోట్లు ఖర్చు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం ప్రకటించారు. బాలాసోర్ జిల్లా బహనాగా వద్ద ఇటీవల జరిగిన రైలు విషాదం దాని సంసిద్ధతకు ఉదాహరణగా పేర్కొన్నారు. విపత్తు నిర్వహణపై ప్రతి గ్రామం నుంచి కనీసం 10 మందికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రభుత్వ అధికారులు కూడా శిక్షణ పొందుతారని చెప్పారు. సరైన శిక్షణ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటి నుంచి విపత్తు నిర్వహణ యోధులు పుట్టుకొస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, విపత్తు నిర్వహణ మంత్రి సుదామ్ మార్‌ండి, అదనపు ముఖ్య కార్యదర్శి (విపత్తు నిర్వహణ), స్పెషల్ రిలీఫ్ కమిషనర్ సత్యబ్రత సాహు, ప్రపంచ బ్యాంక్ కంట్రీ డైరెక్టర్, అగస్టే టానో కౌమే, ఒడిశా రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటి (ఓస్డమా) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞాన రంజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విపత్తు నిర్వహణ కార్యకలాపాలపై ప్రదర్శన ప్రారంభించారు. ప్రత్యేక పరికరాలు, విన్యాసాలు సందర్శకుల్ని ఆకట్టుకున్నాయి.

రాయగడ: ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొంటున్నామని సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రా దేవి అన్నారు. రాయగడలోని డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో ఆదివారం ఒడిశా విపత్తు సంసిద్ధం దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మెజిస్ట్రేట్ రామేశ్వర్ ప్రధాన్, జిల్లా ఎమర్జెన్సీ అధికారి సూర్యమణి భోయ్, ఎస్‌డీపీఓ రస్మీరంజన్ సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: విపత్తులు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. పర్లాకిమిడి ప్యాలస్ వీధిలో ఆదివా విపత్తుల సంసిద్ధత దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులతో చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఒడిశా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సిబ్బంది, ఫైర్ సిబ్బంది కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. జిల్లా పరిషత్ కాన్ఫరెన్సు హాలులో జిల్లా ఎమెర్జెన్సీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్‌దాస్, డీఎఫ్ఓ ఆనంద్ సుబ్రహ్మణ్యం, ఐటీడీఏ సీడీఎం గుణనిధి నాయక్ తదితరులు ప్రసంగించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

బరంపురం: ఛత్రపూర్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం బరంపురం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ దివ్యజోతి పరిడా పాల్గొన్నారు.



భువనేశ్వర్:విపత్తు సంసిద్ధత మినీ-మారథాన్



బరంపురం : భవంతిలో చిక్కుకున్న వారిని సురక్షితంగా కిందకు దించుతూ..



బరంపురం : సహాయక చర్యలు చేపడుతూ..



బరంపురం : మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



రాయగడ: ప్రసంగిస్తున్న సంఘమిత్రా దేవి. వేదికపై రామేశ్వర్ తదితరులు



పర్లాకిమిడి: చైతన్య ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్



పర్లాకిమిడి: అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పర్లాకిమిడి: విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

అట్టహాసంగా క్రీడా సంబరాలు

- ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించిన కోలగట్ల



ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: క్రీడల ఖిల్లా విజయనగరం క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. విజయనగరం ఉత్సవాలు, శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర నేపథ్యంలో స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో ఉత్తరాంధ్ర స్థాయిలో కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ క్రీడా రంగానికి చేయూతనందిస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. స్టేడియం అభివృద్ధికి గతంలో తీసుకున్న చర్యలను గుర్తు చేశారు. వాలీబాల్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ కృష్ణ తన తండ్రి (కనకల ఎర్రయ్య) మీద అభిమానంతో ఉత్తరాంధ్ర స్థాయిలో వాలీబాల్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులంతా మంచి క్రీడాస్ఫూర్తితో ఆడి విజేతలుగా వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈవో రాంగోపాల్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్, కార్యదర్శి కాళ్ల సూరిబాబు, వివిధ జిల్లాల కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న డ్వాక్రా బజార్

- 18 రాష్ట్రాలకు చెందిన 251 స్టాల్స్ ఏర్పాటు
- హస్తకళలు, వస్త్రాలు, అలంకార వస్తువుల ప్రదర్శన

విజయనగరం అర్బన్: అఖిల భారత డ్వాక్రా బజార్ పేరుతో స్థానిక ట్యాంక్ బండ్ రోడ్డును ఆనుకుని ఉన్న మాన్సాస్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, విక్రయశాల పట్టణవాసులను ఆకట్టుకుంటోంది.

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సరస్ (సేల్స్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిషన్ సొసైటీ) పరిధిలోని వివిధ రాష్ట్రాలకు, రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళల తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులతో సుమారు 251 స్టాల్స్‌ను ఈ బజార్‌లో ఏర్పాటు చేశారు. తొలిరోజున సందర్శకుల తాకిడి పెరిగింది. ప్రధానంగా హ్యాండీ క్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయాలు అధికంగా జరిగాయి. మరో వైపు సందర్శకుల పిల్లలను ఆహ్లాదపరిచేందుకు ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు పర్యవేక్షణలో ఈ ప్రదర్శన వచ్చే నెల 8వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కళలకు కాణాచి.. విద్యలకు నిలయం... సాంస్కృతిక రాజధాని... క్రీడలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన నగరంలో వైభవం ఉట్టిపడేలా విజయనగరం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే విజయనగరం ఉత్సవాలు మొదటి రోజు అంగరంగం వైభవంగా సాగాయి. మేళతాళాలు.. మంగళ వాయిద్యాలు.... వేద పండితుల మంత్రోచ్చరణలు... తప్పెటగుళ్ల, కోలాటం, బిందెల నృత్యం, చెక్కభజనలు, గంగిరెద్దులు, ఘటాలు, పులి వేషాలు, సాము గరిడీల ప్రదర్శనలతో సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా శోభాయాత్ర సాగింది. శోభాయాత్రలో కవులు, సాహితీవేత్తలు, క్రీడాకారులు, ఎన్‌సీసీ విద్యార్థులు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, యువకులు, వృద్ధులు పాల్గొన్ని యాత్రకు మరింత వన్నెతెచ్చారు. వేలాది మందితో సాగిన శోభాయాత్రతో విద్యలనగరం తన పేరుకు సార్థకతను చేకూర్చుకుంది.

ఉత్సవ వైభవం

- అట్టహాసంగా ప్రారంభమైన విజయనగరం ఉత్సవాలు
- సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళా ప్రదర్శనలు
- వివిధ వేదికల వద్ద సందర్శకులతో సందడిగా మారిన వాతావరణం
- శ్రీ పైడితల్లమ్మ వారి ఆలయం నుంచి ప్రదర్శనలు ప్రారంభించిన మంత్రి బొత్స
- ఉత్సవాలను తిలకించేందుకు తరలివస్తున్న భక్తులు



విద్యుత్ కాంతులతో పైడితల్లి అమ్మవారి ఆలయం ప్రాంతం

విజయనగరం:

వైభవం ఉట్టిపడేలా విజయనగరం ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ, ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి కోట, సింహాచలం మేడ మీదుగా గురజాడ కళాక్షేత్రం వరకు ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారి గుడి వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కోట జంక్షన్‌లో ర్యాలీలోని కళారూపాల ప్రదర్శనను తిలకించారు. సుమారు 71 కళారూపాలతో ఈ ర్యాలీ అంగరంగ వైభవంగా సాగింది.

గురజాడ కళాక్షేత్రంలో జరిగిన ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, మన సంస్కృతి సంప్రదాయం, కళల పరిరక్షణకు ఇటువంటి ఉత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. పండుగకు వచ్చే లక్షలాది మంది భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్నిరకాల ఏర్పాట్లను చేసినట్టు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఆయనకు ఆ పైడితల్లమ్మ వారి ఆశీస్సులు సదా ఉండాలని ఆకాంక్షించారు.

ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ, వివిధ కళల్లో నిష్ణాతులు, ప్రావీణ్యం ఉన్న వారి ప్రోద్బలంతో, పెద్దల ఆదేశాలకు అనుగుణంగా, మన సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. వివిధ కళారూపాలతో, కళాకారులతో పట్టణానికి కొత్త శోభ వచ్చిందని పేర్కొన్నారు. అత్యంత వైభవంగా మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు సంకల్పించామని, దీనికి అన్ని వర్గాలు సంపూర్ణంగా సహకరించాలని కోరారు.

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విజయనగరం ఉత్సవాలు మన వైభవానికి, సంస్కృతికి ప్రతిబింబాలని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, సంస్కృతి, కళలు, సంప్రదాయాల పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం సంపూర్ణ సహకారంతో ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ మన కళలు, సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శనకు ఇదొక గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, అందరి భాగస్వామంతో అన్ని వర్గాలను అలరించే విధంగా ఉత్సవాలను, ఉత్సవ కార్యక్రమాలను రూపొందించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, ఎస్పీ దీపికా పాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, వివిధ వేదికలు, కార్యక్రమాల ఇన్‌చార్జిలు సుధాకరరావు, రాజ్ కుమార్, వి.టి.రామారావు, ఇతర అధికారులు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విజయనగర ఉత్సవాల్లో భాగంగా ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహారాజా సంగీత కళాశాల ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలు, శాస్త్రీయ సంగీతం, జానపద సంగీత కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. రెండు రోజుల పాటు సుమారు 40 బృందాలు ప్రదర్శన ఇవ్వనున్నాయి. ఈ ప్రదర్శనలను మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎస్పీ దీపికాపాటిల్ తదితరులు వీక్షించారు. అనంతరం కళాకారులను సన్మానించి మెమెంటోలను అందజేశారు.

ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శనలు

మహారాజ సంగీత కళాశాలలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన విజ్ఞానదాయకంగా, నయనానందకరంగా చూపరులను అలరించింది. ఈ ప్రదర్శనలో ఫ్రెష్ ఫ్లవర్స్, డ్రై ఫ్లవర్స్, వెజిటబుల్ కార్వింగ్, సైకత శిల్పం, నర్సరీ తదితర మొక్కలను ప్రదర్శించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింట్ ఆకర్షిస్తోంది. పూలు, మొక్కలతో తయారు చేసిన భారత దేశం మ్యాప్, పూల పుట్టగొడుగులు, కాఫీ మగ్ విత్ కప్, పూలతో చేసిన పలు రకాల పక్షులు, జంతువులు బార్బీడాల్, వాటర్ ఫౌంటెయిన్, పెద్దల్లో పిల్లల్లో ఆనందాన్ని నింపుతున్నాయి.

ఘనంగా సాహిత్య కార్యక్రమాలు

లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో ప్రారంభం రోజున 80 మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధన రావు, కవులు జక్కు రామకృష్ణ, చీకటి దివాక ర్, మింది విజయమోహనరావు, సూర్య లక్ష్మి, చంద్రిక, చివుకుల శ్రీలక్ష్మి, బాలకృష్ణ తదితరు ల ఆధ్వర్యం లో జరిగిన కవి సమ్మేళనంలో కవు లను ఘనంగా సన్మానించారు. అనంతరం 108 మంది సాహితీ మూర్తుల విరచిత రచనా సమాఖ్య వారి గురుబ్రహ్మ పుస్తకాన్ని ఆవిష్కరించారు. లయన్స్ క్లబ్‌లో జానపద కళలైన గొల్లుపల్లి సత్యారావు, పులి వేషాలు, కర్ర సాము, డప్పు నృత్యం, నవ దుర్గల నృత్యాలు, రేలా రేలారె ఫోక్ ఆర్కెస్ట్రా, థింసా నృత్యం గిరిజన నృత్యా లు హోరెత్తించాయి.



కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన మంత్రి బొత్స సత్యనారాయణ